విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 14, సెప్టెంబరు 2025

నిరుద్యోగులను మోసం చేసిన కూటమి ప్రభుత్వం..

సీపీఐ జిల్లా కార్యదర్శి పి.నారాయణ స్వామి

విశాలాంధ్ర-అనంతపురం : ఎన్నికలకు ముందు రాష్ట్రవ్యాప్తంగా యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.నారాయణ స్వామి విమర్శించారు. శనివారం నాడు నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో జరిగిన ఏఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కె.కోట్రేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిధిగా సీపీఐ జిల్లా కార్యదర్శి పి నారాయణస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు "రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తాం, 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం" అని యువతకు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మాత్రం డీఎస్సీ మినహా ఇతర నోటిఫికేషన్లు ఏవీ ఇవ్వలేదని మండిపడ్డారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జి.సంతోష్ కుమార్ మాట్లాడుతూ... 2024 ఎన్నికలకు ముందు వైసిపి ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని, తరువాత కూటమి పార్టీ ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, ఉద్యోగాలు ఇవ్వలేని పక్షంలో నిరుద్యోగ భృతి రూపంలో నెలకు రూ.3వేలు ఇస్తామని యువగళం పాదయాత్రలో అప్పటి యువనేత, ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ఇప్పటివరకు ఉద్యోగాల నోటిఫికేషన్లపై గానీ, నిరుద్యోగ భృతిపై గానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈనెల 18వ తేదీ నుండి జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లపై చర్చించి, నిరుద్యోగ భృతి గురించి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్ సాధన కోసం ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17న విజయవాడలో "నిరుద్యోగుల ఆవేదన రాష్ట్ర సదస్సు" నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉద్యోగ సాధన కోసం పోరాటాన్ని మరింత బలపరుస్తామన్నారు. అనంతపురం జిల్లా నుండి పెద్ద ఎత్తున నిరుద్యోగులు, యువతీ యువకులు విజయవాడ సదస్సుకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దేవేంద్ర, జిల్లా సహాయ కార్యదర్శులు వంశీ కృష్ణ, ధనుంజయ, కోశాధికారి శ్రీనివాసులు, నాయక్, తేజ పాల్గొన్నారు.

కలెక్టర్‌గా ఆనంద్ బాధ్యతల స్వీకరణ..

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: అనంతపురం జిల్లా నూతన కలెక్టర్ గా ఓ.ఆనంద్ శనివారం మధ్యాహ్నం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కలెక్టరేట్ కు చేరుకున్న నూతన జిల్లా కలెక్టరుకు డిఆర్ఓ ఏ.మలోల, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్ పూల మొక్కలను అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఛాంబర్ కు చేరుకున్న నూతన జిల్లా కలెక్టర్ దేవుని పటానికి నమస్కరించారు. తదనంతరం నూతన జిల్లా కలెక్టర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆ తరువాత పంపనూరు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, పెన్న అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు జిల్లా కలెక్టర్ కు ఆశీర్వాదం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు ఆర్డీవోలు వసంత బాబు, శ్రీనివాస్, కేశవ నాయుడు, కలెక్టరేట్ సెక్షన్ల సుపరింటెండెంట్లు యుగేశ్వరి దేవి రియాజుద్దీన్, వసంతలత, వివిధ శాఖల జిల్లా అధికారులు పూల మొక్కలు, పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

అంతక ముందు నూతన కలెక్టర్ శనివారం మధ్యాహ్నం నగరంలోని ఆర్.అండ్.బి అతిథి గృహంలో నూతన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ గారికి జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఓ ఏ.మలోల, తహసీల్దార్ హరికుమార్, ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షులు దివాకర్ బాబు, తదితరులు పూలమొక్కలు, పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు.

యూరియా కోసం రైతులు ఇంకా ఎన్నిరోజులు తిప్పలు పడాలి

కనేకల్ మండల ఏపీ రైతు సంఘం నాయకులు సర్మాస్

విశాలాంధ్ర-కణేకల్లు: అందరికీ అన్నం పెట్టే రైతన్నలకు నేడు యూరియా కోసం కష్టాలు తప్పడం లేదు, ఈ కష్టాలు ఇంకెన్నాళ్లు.. యూరియా సమస్యను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కనేకల్ మండలం ఏపీ రైతు సంఘం నాయకులు సర్మాస్ డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సర్మాస్ మాట్లాడుతూ రైతులకు యూరియా ఎందుకోసం అందడం లేదు, ప్రభుత్వం చూస్తే మన రాష్ట్రానికి మెట్రిక్ టన్నులు టన్నులు అని ప్రభుత్వం చెబుతున్నది, అయినప్పటికీ రైతులకు యూరియా కొరత ఎందుకోసం రైతులకు తిప్పలు విజిలెన్స్ లోపమా రైతు సంబంధించిన అధికారుల లోపమా, కనేకల్ రావలసిన యూరియా లారీలు మాయమై ఎక్కడ తేలుతున్నాయో అర్థం కావడం లేదు. ఈ లోపం ఎక్కడ జరిగిందో ప్రభుత్వం ఒక్కసారి దృష్టి పెట్టి చూడండని చెబుతున్నారు. రైతు సంఘం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులకు కనేకల్ మండల ఎమ్మార్వో బ్రహ్మయ్యకి గత సోమవారం వినతిపత్రం సమర్పించిన ఇప్పటి వరకు చిన్నకారు రైతులకు ఒక్క బస్తా యూరియా దొరకలేని పరిస్థితి ఉందన్నారు. దీనిపై చర్య తీసుకొని ప్రతి రైతుకు అందే విధంగా ఎమ్మార్వో వ్యవసాయాన్ని సంబంధించినటువంటి ఏవో జగదీష్ దీనిపై చర్య తీసుకొని ప్రతి రైతుకు అందే విధంగా పంపిణీ చేయాలని ఏపీ రైతు సంఘం వారు కోరుతున్నారు, ఇప్పుడు కూడా రైతులు ఇబ్బందులు పడితే పెద్ద ఎత్తున రాస్తారోకో కార్యక్రమానికి శ్రీకారం చుడతానని తెలుపుతున్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

సీపీఐ మండల కార్యదర్శి మధు యాదవ్

విశాలాంధ్ర-శింగనమల : మండల వ్యాప్తంగా గత మూడు రోజులుగా భారీగా కురుస్తున్న వర్షాల వల్ల గ్రామాల్లో వీధులన్నీ బురదమయమై దోమ కాట్లకు గురై టైఫాయిడ్, మలేరియా, డెంగీ, వైరల్ ఫీవర్స్,వంటి విష జ్వరాలు సోకుతున్నాయని, గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి మధు యాదవ్ డిమాండ్ ప్రభుత్వాన్ని చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో వైరల్ ఫీవర్ తో చాలామంది ఆసుపత్రికి బాటలు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో వీధి వీధినా క్లోరినేషన్, బ్లీచింగ్ పౌడర్ వంటివి చల్లడంలో అధికారులు ప్రతి సంవత్సరం అశ్రద్ధ వహిస్తున్నారని, మండల వైద్యాధికారులు మేల్కొని గ్రామాల్లో అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పర్యటించి ప్రజల ఆరోగ్యం కాపాడాలని, మండల కేంద్రంలోని ఆసుపత్రిలో రోగులు నిండిపోతున్నారని, వైద్యులు గ్రామాల్లో పర్యటించి విష జ్వరాలు ప్రబలకుండా వైద్యులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు..

విశాలాంధ్ర-ఉరవకొండ : జిల్లా స్థాయిలో జరిగే స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలలో పాల్గొనందుకు ఎంపికైన విడపనకల్లు మండలం కరకముక్కల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను శనివారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ బృందం అభినందించారు. సెపక్ తక్రా పోటీలలో పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న హెచ్. అఖిల్ అండర్ 14 విభాగంలో, పదవ తరగతి చదువుతున్న కే.సుజాత అండర్ 17 విభాగంలో 9వ తరగతి చదువుతున్న ఎం.భానుప్రియ అండర్ 19 విభాగంలో ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయుడు సయ్యద్ అజ్మతుల్లా తెలియజేశారు. విద్యార్థులు త్వరలో ఉరవకొండలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ పరశురాం, ఉపాధ్యాయులు నటరాజు, ఆదినారాయణ, సురేంద్ర, కేఎం హేమలత, మహబూబ్ బాషా, హేమలత, ఏం.ప్రమీల, అభినందనలు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఎం శివకుమార్ విద్యార్థుల ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేశాడు.

వైసీపీ సీనియర్ నేత తోపుదుర్తి భాస్కర్ రెడ్డి మృతికి సీపీఐ సంతాపం

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం : సుదీర్ఘ కాలం రాజకీయాల్లో కొనసాగిన తోపుదుర్తి భాస్కర్‌రెడ్డికి అనంతపురం సిపిఐ సంతాపం ప్రకటించింది. శనివారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్, శ్రీసత్యసాయి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.వేమయ్య యాదవ్ తోపుదుర్తి భాస్కర్‌రెడ్డికి నివాళులు అర్పించారు. భాస్కర్ రెడ్డి శుక్రవారం గుండెపోటుతో ఆకస్మికంగా మరణించడం దురదృష్టమన్నారు. ఆయన ఆత్మీయులు, మంచి మనిషి, స్నేహశీలి, రాజకీయాలకు అతీతంగా అందరూ అభిమానించే ఉత్తముడని పేర్కొన్నారు. తోపుదుర్తి భాస్కర రెడ్డి అకాల మృతి చెందడం అత్యంత బాధాకరమని జగదీష్ పేర్కొన్నారు.

రైతులకు సరిపడా యూరియా పంపిణీ : ఏడీఏ

విశాలాంధ్ర-రాప్తాడు : రైతులు సాగు చేసిన పంటలకు పిచికారీ చేసుకునేందుకు సరిపడా యూరియాను సరఫరా చేస్తున్నామని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అల్తాఫ్ ఖాన్ అన్నారు. రాప్తాడు, ప్రసన్నాయపల్లి సచివాలయాల పరిధిలోని అయ్యవారిపల్లి, ప్రసన్నాయపల్లి, రాప్తాడు, గంగలకుంట, రామనేపల్లి గ్రామాల రైతులకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు శనివారం సబ్సిడీతో యూరియాను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియాను సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పంపు కొండప్ప, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గంగలకుంట కిష్ట, ఏఓ కృష్ణచైతన్య, టీడీపీ ఉపాధ్యక్షుడు జూటూరు రామకృష్ణ, ఏఈఓ సుజిత పాల్గొన్నారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

విశాలాంధ్ర-నార్పల : మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి మరియు లక్ష్మి నరసింహ స్వామీ ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మేంద్ర స్వామి పర్యవేక్షణలో అనంతపురం ప్రఖ్యాత్ డెంటల్ హాస్పిటల్ వారిచే ఆలయం దగ్గర ఉదయం 9గంటల నుంచి ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిం చనున్నారు. శిబిరంలో దంత పరీక్షలు చేయడమే గాకుండా అవసరమైన వారికి పిప్పి పళ్లు ఉంటే తీసివేస్తారన్నారు. సిమెంట్ కట్టడం వంటి సేవలను కూడా అందిస్తామని,పరిసర ప్రాంత వాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

మాజీ మంత్రి శైలజ నాథ్‌కు అస్వస్థత

విశాలాంధ్ర-శింగనమల : మాజీ మంత్రి వైసీపీ శింగనమల నియోజక వర్గం సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ వైరల్ ఫీవర్‌తో హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారు వైరల్ ఫీవర్ భారీ నుండి కోలుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులు గా తొందరగా కోలుకొని, ప్రజలకు అండగా, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పార్టీ నాయకులు దేవుడిని ప్రార్థించారు.

30 లోగా పంట నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-రాప్తాడు : ఖరీఫ్ సీజనులో రైతులు తమ పొలాల్లో సాగు చేసిన పంటల వివరాలను ఈనెల 30వ తేదీలోగా ఈ-పంట యాప్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అల్తాఫ్ అలీఖాన్ సూచించారు. మండలంలోని గొందిరెడ్డిపల్లి గ్రామంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణచైతన్యతో కలిసి ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. రైతులు పంట నష్టపరిహారం పొందాలన్నా, వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించుకోవాలన్నా కీలకమైన ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను తప్పనిసరి అన్నారు. ఖరీఫ్ పంటలకు సంబంధించి వ్యవసాయ శాఖ సిబ్బంది, వీఆర్ఓలు గ్రామాల్లో పర్యటిస్తూ భూమి విస్తీర్ణం, ప్రస్తుతం సాగులో వున్న పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సుజిత, ఎంపీఈఓ గంగరాజు తదితరులు ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి..

- రాష్ట్ర ఆరోగ్య పరిశీలకురాలు శైలజ
- చందన ఆరోగ్య ఉప కేంద్రం తనిఖీ

విశాలాంధ్ర-యాడికి : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర ఆరోగ్య పరిశీలకురాలు శైలజ వైద్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చందన గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని శనివారం రాష్ట్ర ఆరోగ్య పరిశీలకురాలు శైలజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈమె ప్రజలకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరోగ్య పథకాలు ఎలా ప్రజలకు చేరుతున్నాయి. ఆరోగ్య విద్య ఎలా చెబుతున్నారు. రికార్డ్స్‌లో ఎలా నమోదు చేస్తున్నారు.. ఇలా ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం అధికారులను కూడా జూమ్ ద్వారా ఇక్కడి పరికరాలను, గోడలకు తగిలించిన సమాచారం పోస్టర్స్‌ను రికార్డ్స్‌ను చూపించారు. అధికారి శైలజ కూడా సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా అన్ని ఉపకేంద్రాలలో రికార్డ్స్ పరికరాలు, డిస్ప్లే బోర్డులు, మెయింటైన్ చేయమని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దేవరాజన్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ షబ్బీర్, ఎంఎల్‌హెచ్ పిఎస్, కవిత, శివ, చంద్రకుమారి, ఏఎన్ఎం సబితా, రజని, అనిత, దమయంతి, శివగంగా, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం సూపర్

విశాలాంధ్ర-గుంతకల్లు : గుంతకల్లు పట్టణంలోని డాక్టర్ సరోజినీ నాయుడు పురపాలక బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని గుంతకల్లు రెవెన్యూ డివిజనల్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ జనవిజ్ఞాన వేదిక డాక్టర్ హరి ప్రసాద్ యాదవ్ పరిశీలించారు. ఈ స్కూల్‌లో 250 మందికి దాకా ఎస్సీ ఎస్టీ విద్యార్థులు చదువుతున్న ఈ స్కూల్‌లో మెనూ ప్రకారం మంచిగా భోజనం అందిస్తున్నట్లున్నట్లు గుర్తించి సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విద్యార్థులకు ఇస్తున్నడొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో పౌష్టిక ఆహారం విలువలతో కూడినది అని వారంలో ఆరు రోజులు పాటు రోజుకు ఒక ప్రత్యేకమైన వంట చొప్పున భోజనం ఇవ్వడం అభినందనీయమని దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉంటూ చదువుల్లో ఉన్నత శిఖరాల అధిరోహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం శంకరయ్య ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు వంట ఏజెన్సీ నిర్వాహకులు పద్మావతి నాగరాజు పాల్గొన్నారు.

చల్లా సుబ్బరాయుడు సేవలు మరువలేనివి

వర్ధంతి సభలో ఎమ్మెల్యే జెసి. అస్మిత్ రెడ్డి

విశాలాంధ్ర-తాడిపత్రి : మాజీ మంత్రి, గౌరవనీయులు కీ.శే. చల్లా సుబ్బారాయుడు తాడిపత్రి నియోజకవర్గం చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే జెసి. అస్మిత్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని యల్లనూరు రోడ్డు సర్కిల్లో ఉన్న చల్లా సుబ్బరాయుడు విగ్రహం వద్ద చల్లా సుబ్బరాయుడు వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే జెసి. అస్మిత్ రెడ్డి, చల్లా సుబ్బరాయుడు కుమార్తె అమృత వల్లితో కలిసి చల్లా సుబ్బారాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చల్లా సుబ్బారాయుడు శాసనసభ్యులుగా, తాడిపత్రి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో దోహదపడ్డాడన్నారు. అంతేకాకుండా రైతాంగానికి సాగునీరు అందివ్వడంలో ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జంబుల పాడు సర్పంచ్ ప్రభాకర్ నాయుడు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజశేఖర్ నాయుడు, తెదేపా సీనియర్ నాయకులు ప్రసాద్ నాయుడు, కులశేఖర్ నాయుడు, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి సోమశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

గుంతలమయంగా గుత్తి..గుంతకల్లు రోడ్డు..

- గుంతల్లో ప్రయాణం నరకప్రాయం
- వాహనదారుల ఒళ్లు హూనం
- నిద్రపోతున్న ఆర్ అండ్‌బీ అధికారులు

విశాలాంధ్ర-గుంతకల్లు/ గుత్తి: గుత్తి పట్టణంలో గాంధీ చౌక్ నుండి గుంతకల్లు పట్టణానికి కలిపే లింకు రోడ్డు దారుణంగా మారింది. అడుగు అడుగుకు ఒక గుంత ఏర్పడింది. ఈ కారణంగా ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలీస్ శాఖ నుండి వాహన మిత్ర పేరుతో ఆటోల నుండి 50 రూపాయలు నుండి 100 రూపాయలు వసూలు చేస్తున్నారు... మోకాలు లోతు గుంతల మాయమైన ఈ రోడ్డు దాటడానికి భారీ వాహనాలు నెమ్మదిగా వెళ్లడంతో వెనక వస్తున్న వాహనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎమ్మెన్ కాలేజ్ సమీపంలో మోకాటి లోతు పైనే గుంతలు ఉండడంతో రోడ్డు ప్రమాదాలు నిత్యం జరుగుతున్నాయి. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో గుంతలు లేని రోడ్డు నిర్మిస్తామని చెప్పడం జరిగింది. చంద్రబాబు ఆదేశాలను స్థానిక ఆర్‌అండ్‌బీ అధికారులు తుంగలో తొక్కారు. వర్షాకాలంలో రోడ్డు దాటడానికి తీవ్ర అవస్థలు ఎదుర్కొన్న ప్రయాణికుల, వాహనదారులను దృష్టిలో ఉంచుకొని ఇందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకొని సమస్య పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

15 నుంచి పశువులకు టీకాలు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా ఈనెల 15 నుండి అక్టోబర్ 15 వరకు నాలుగు నెలలుపైబడిన అన్ని ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి వెంకట్ రెడ్డి శనివారంతెలిపారు. సెప్టెంబరు 15 నుంచి అక్టోబర్ 15 వరకు బొమ్మనహాళ్ మండలం వివిధ గ్రామాల్లో ఉన్న పశు వైద్యశాలల్లో టీకాలు వేయడం జరుగుతుందని పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని పశువులను అనారోగ్యం బారి నుంచి కాపాడుకోవాలన్నారు.

లోక్ అదాలత్‌లో 101 కేసులు పరిష్కారం

విశాలాంధ్ర-ఉరవకొండ: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉరవకొండలో నిర్వహించిన లోకదాలతో మొత్తం 101 కేసులు పరిష్కారమయ్యాయి. జూనియర్ సివిల్ న్యాయాధికారి దుర్గా కళ్యాణి ఆధ్వర్యంలో కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్ లో సిసిఐసిసి కేసులు 4 సీసీ ఎక్సైజ్ కేసులు 28 పిఎల్ సి బ్యాంకు కేసుల 16 రూ,760000 ఎస్‌టీసీ కేసులు 53 రూ, 26,500 పరిష్కారం అయినట్లు జడ్జి తెలిపారు.

దళిత రణభేరిని జయప్రదం చేయండి

బి.ఎస్.పి నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీనివాసులు

విశాలాంధ్ర-శింగనమల: ప్రభుత్వాలు పాలకులు మారుతున్న దళితులపై దాడులు ఆగలేదని వీటిని నిరసిస్తూ బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో దళిత రణభేరి సభను జయప్రదం చేయాలని, శింగనమలమండల కేంద్రంలో బిఎస్పి నియోజకవర్గ ఇన్చార్జ్, జిల్లా అడ్వైజర్ కమిటీ సభ్యుడు బి శ్రీనివాసులు, శింగనమల నియోజకవర్గం ఇన్చార్జి రమేష్ లు గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వాలు పాలకులు మారుతున్నానేటి కంప్యూటర్ యుగంలో కూడా దళితులపై దాడులు ఆగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుల వివక్ష, అంటరానితనాన్ని కూకటి వేళ్ళతో పెకలించాలని, దళిత సామాజిక వర్గం ఏకమై వివక్షను, అంటరానితనాన్ని ఎదిరించాలన్నారు,

రెండు అధికార కులాల మధ్య దళితులు నలిగిపోతున్నారన్నారు. ఒకరు పోతే ఒకరు చొక్కాలు మార్చుకున్నట్లుగా అధికారాన్ని మార్చుకుంటూ తమ అధికార పీఠాన్ని పదిలపరుచు కుంటున్నారన్నారు. వీరిని ఎదుర్కొనేందుకు మెజార్టీ వర్గమైన దళితులందరం ఏకం కావాలన్నారు. రెండు కులాల అధికార ఉన్మాదానికి సామాన్యులు ముఖ్యంగా బహుజన కులాలు మాల, మాదిగ, గిరిజన, కులాలు ఆహుతవుతున్నారన్నారు. సెప్టెంబర్ 24వ తేదీ విజయవాడలో ధర్నా చౌక్ దగ్గర జరిగే దళిత రణభేరి ధర్నాకు నియోజకవర్గంలోని బహుజన సమాజ్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు, మేధావులు, అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అమరావతిపై జగన్ రివర్స్ డ్రామాలు : మంత్రి సవిత

విశాలాంధ్ర-పెనుకొండ : రాజధాని అమరావతిపై జగన్ రివర్స్ డ్రామాకు తెరతీశారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత మండిపడ్డారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్టిలో పెట్టుకుని అమరావతిపై మరో జగన్నాటకానికి తెర తీశాడని శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఏరు దాటాక తెప్ప తగలేసే రకం జగన్‌దన్నారు. 2019 ఎన్నికల సమయంలో అమరావతే రాజధాని అని, తన నివాసం ఇక్కడే ఉందని ప్రజలను నమ్మబలికాడన్నారు. అధికారంలోకి రాగానే, మాట మార్చేసి మూడు రాజధానులంటూ మూడు ముక్కలాటకు తెర తీశాడన్నారు. అయిదేళ్లలో ఏ ఒక్క ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా, రాజధాని లేని రాష్ట్రానిగా ఏపీని భ్రష్టు పట్టించాదరన్నారు. అమరావతిని స్మశానమని, మునిగిపోయే ప్రాంతమని చులకన చేసి జగన్ సహా వైసీపీ నాయకులంతా మాట్లాడారన్నారు. ఆంధ్రుల చిరకాల కలయిన అమరావతి కోసం భూములిచ్చిన రైతులను, మహిళలను పెయిడ్ ఆర్టిస్టులంటూ హేళన చేశారన్నారు. వారిని నిర్బంధాలకు గురిచేస్తూ, పోలీసులతో కొట్టించారన్నారు. జగన్ అరాచక పాలనతో విసిగిపోయిన యావత్ ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఛీ కొట్టి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. నిన్నగాక మొన్న తన నీలి మీడియాలో అమరావతి వేశ్యల నగరమంటూ సభ్య సమాజం సిగ్గుపడేలా తప్పుడు మాటలు ఆడించారన్నారు. ఇన్ని విధాలా అమరావతిపై విషంకక్కిన జగన్..ఇపుడు రాజధానికి అనుకూలమంటూ చెప్పడం మరో జగన్నాటకానికి తెర తీయడమేనన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికిని కాపాడుకోడానికి జగన్ రెడ్డి ఆడుతున్న రివర్స్ డ్రామా అని మండిపడ్డారు. అయితే కాళ్లు పట్టుకోవడం, లేకుంటే జుట్టు పట్టుకోవడం జగన్ కు అలవాటేనన్నారు. జగన్ ఎన్ని రివర్స్ డ్రామాలు ఆడినా ప్రజలు పట్టించుకునే పరిస్థితుల్లో లేరన్నారు. సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, తమ కలల రాజధాని సాకారం అవుతుందని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారని స్పష్టం చేశారు.

పేదల ఆరోగ్య భద్రతపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ..

విశాలాంధ్ర-పుట్టపర్తి : పేదల ఆరోగ్య భద్రతపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పుట్టపర్తి నియోజకవర్గానికి సంబంధించిన నలుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 2,03,969 ల ఆర్థిక చెక్‌ను ఎమ్మెల్యే సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిలు అందజేశారు. ఇరగరాజుపల్లి శకుంతలమ్మా రూ. 17150లు, ఊటకూరు మల్లమ్మకు రూ.30,323 లు,నల్లమాడ మండలం యర్రవంకపల్లి అన్నం నరసింహులు రూ.51300, ఓడి చెరువు మండలం సున్నం పల్లికి చెందిన వంశీకృష్ణ రూ.1,05196ల ముఖ్యమంత్రి ఆర్థిక సహాయ నిధి చెక్‌ను అందజేశారు. పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గ కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అగళిలో ఉత్సాహంగా గణేష్ నిమజ్జనం

విశాలాంధ్ర-అగళి : మండల కేంద్రంలోని దళితవాడలో వినాయకచవితిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన గణపతిని శనివారం అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిమజ్జనం చేశారు. భక్తమండలి యువకులు ఏర్పాటు చేసిన భారీ గణనాథుడిని దాదాపు 18 రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో విశేష పూజలను నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు. వినాయకుని ప్రతిమను వివిధ రకాల పూల మాలలతో చూడ ముచ్చటగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ముస్తాబు చేసిన ట్రాక్టర్లలో వినాయకున్ని కూర్చోబెట్టి యువకులు రంగులు చల్లుకుంటూ మేళతాళాలు డీజే పాటలతో నృత్యాలు చేస్తూ చిందులువేస్తూ ఊరేగింపు కొనసాగించారు. మహిళలు చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొని బాణా సంచాలతో, ఊరేగింపు చేపట్టారు. ఈసందర్భంగా గణపతి బప్పా మోరియా,జై జై గణేశా జై జై గణేశా, అంటూ నినాదాలతో భక్తుల సందడితో ఉత్సాహంగా చెరువులో గంగమ్మ ఒడిలోకి నిమజ్జనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఉమేష్, కన్వీనర్ తిప్పేస్వామి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కేంచయాదవ్, జిల్లా వాల్మీకి సంఘం ఉపాధ్యక్షులు రమేష్, సర్పంచ్ నరసింహ మూర్తి, సింగల్ విండో డైరెక్టర్ శివప్ప, క్లస్టర్ కో కన్వీనర్ శివన్న, నాయకులు రాజగోపాల్, రాజన్న, రాజు వినాయక భక్త మండలి యువకులు, దళితవాడ యువకులు మహిళలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.అతిథులను వినాయక మండలి సభ్యులు ఘనంగా సన్మానించారు.

హోరాహోరీగా సాగిన సెమీ ఫైనల్స్

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని ఆర్డీటీ మైదానంలో జరిగిన అటల్ బిహారి వాజ్ పాయ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2 సెమీ ఫైనల్ పోటీలు ఉత్కంఠభరితంగా, హొరాహొరీగా కొనసాగాయి. మొదటి మ్యాచ్‌లో డ్రాగన్ - లెవెన్స్ జట్టు, గొట్లూరు జట్లు తలపడ్డాయి. ఈ పోరును బీరే కేశవ టాస్ వేసి ప్రారంభించారు. టాస్ అనంతరం ఆడిన డ్రాగన్ లెవెన్స్ జట్టు 12 ఓవర్లలో 174 పరుగులు 4 వికెట్లు కోల్పోయి సాధించింది. ప్రత్యర్థిగా బరిలోకి దిగిన గొట్లూరు జట్టు మాత్రం 100 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి పరాజయం పాలైంది. చివరికి డ్రాగన్ - లెవెన్స్ జట్టు 74 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. రెండవ సెమీ ఫైనల్ మ్యాచ్‌లో లక్ష్మీ నరసింహ - లెవెన్స్ జట్టు, హిందూపూర్ హంటర్స్ జట్టు తలపడ్డాయి. ఈ పోరును బీజేపీ నాయకులు కృష్ణాపురం జమీర్ టాస్ వేసి ప్రారంభించారు. ముందుగా ఆడిన లక్ష్మీ నరసింహ - లెవెన్స్ జట్టు 12 ఓవర్లలో 103 పరుగులు 4 వికెట్లు కోల్పోయి నిలిచింది. అయితే ప్రత్యర్థి హిందూపూర్ హంటర్స్ జట్టు కేవలం 7 ఓవర్లలోనే 108 పరుగులు 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఫలితంగా హిందూపూర్ హంటర్స్ జట్టు 8 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ రెండు మ్యాచ్‌లలో విశేష ప్రతిభ కనబరిచిన ఏం.ప్రశాంత్ రెడ్డి (డ్రాగన్ లెవెన్స్), అయాజ్ (హిందూపూర్ హంటర్స్)లకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ పురస్కారాలు దక్కాయి. ఈ జ్ఞాపికలను మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు, ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ హనుమంతప్ప, బీజేపీ నాయకులు కృష్ణాపురం జమీర్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోచ్ రాజశేఖర్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొంక నాగార్జున, శ్యామ్ రావు, బీరే కేశవ ఎర్రజోడు లోకేష్, సొమ్లా నాయక్, జూటూరు వెంకటేష్, పెద్దకోట్ల ఆనంద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలను పారదర్శకంగా ముందుకు తీసుకెళ్తాం

▸ నూతన జిల్లా కలెక్టర్‌గా శ్యాం ప్రసాద్ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో/పుట్టపర్తి-శ్రీ సత్యసాయి: ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో ప్రభుత్వ సేవలను పారదర్శకంగా ముందుకు తీసుకెళ్లి జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేస్తానని కలెక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నూతనంగా జిల్లా కలెక్టర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అధికారులు, సిబ్బంది పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. మీడియా విలేకరులతో కలెక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ తాను పార్వతీపురం మన్యం జిల్లా నుండి కలెక్టర్‌గా బదిలీ అయ్యి ఇక్కడ బాధ్యతలు స్వీకరించానన్నారు. సత్యసాయి జిల్లాతో తనకు అవినాభావ సంబంధం ఉందని, తన కుమార్తె విద్యాభ్యాసం కూడా ఇదే ప్రాంతంలో జరిగిందన్నారు. జిల్లాలో రాబోయే వంద సంవత్సరాల శ్రీసత్య సాయిబాబా జన్మదినోత్సవ వేడుకలను కూడా విజయ వంతంగా నిర్వహించేందుకు అందరూ సహకారం అందించాలని కోరారు. కర్ణాటక రాష్ట్రానికి సమీపంలో ఉండి వెనుకబడిన శ్రీసత్యసాయి జిల్లాను అన్ని విధాల ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. వ్యవసాయ ఆధారిత జిల్లా అయిన సత్య సాయి జిల్లాలో పారిశ్రామిక రంగానికి కూడా ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లాలో పరిశుభ్రత, నీటి సరఫరా, విద్యుత్, జల సంరక్షణ, ఆరోగ్యము విద్య తదితర ప్రధానమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలియజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను మరింత సమర్థంగా అమలు చేసి ప్రజలకు చేరవేయడమే తన ముఖ్య లక్ష్యంగా ఉంటుందని తెలిపారు. జిల్లా అధికారులను, సిబ్బందిని పరిచయం చేసుకుని, పరిపాలనను సమర్థవంతంగా నడిపేందుకు అందరూ సహకరించాలని సూచించారు సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇంఛార్జి డిఆర్ఓ రామసుబ్బయ్య, ఆర్డీవోలు సువర్ణ, మహేష్, వివిఎస్ శర్మ, ఆనంద్ కుమార్, జిల్లా అధికారులు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ టి.ఎస్.చేతన్ సహకారం మరువలేం

కలెక్టర్‌కు వీడ్కోలు పలికిన పరిటాల శ్రీరామ్

విశాలాంధ్ర బ్యూరో-శ్రీ సత్యసాయి: సత్యసాయి జిల్లా కలెక్టర్‌గా పని చేసిన టి.ఎస్.చేతన్ సహకారాన్ని మరువలేమని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ఆయన బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో శనివారం పుట్టపర్తి కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పరిటాల శ్రీరామ్ కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ఏడాది కాలంపైగా ఆయన జిల్లాకు విశేష సేవలందించా రన్నారు. ధర్మవరం నియోజకవర్గం విషయంలో ఏ సమస్య ఉందని చెప్పినా ఆయన వెంటనే స్పందించే వారన్నారు. ప్రజా సమస్యలపై స్పందించే తీరు ఎంతో బాధ్యతగా ఉంటుందన్నారు. నిత్యం అందుబాటులో ఉండే కలెక్టర్‌గా చేతన్ నిలుస్తారన్నారు. ఆయన అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరువలేమన్నారు. అనంతరం పరిటాల శ్రీరామ్ కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వీడ్కోలు పలికారు.

శిల్పకళా ఆలయంలో హైకోర్టు న్యాయమూర్తి

విశాలాంధ్ర-లేపాక్షి: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన దుర్గ వీరభద్రస్వామి దేవాలయాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జి.రామక్రిష్ణప్రసాద్ శనివారం ఉదయం సందర్శించారు. ఈయనకు ఆలయ అర్చకులు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతించగా హిందూపురం అదనపు జిల్లా జడ్జి కే.శైలజతో పాటు పెనుకొండ ఆర్డీఓ ఆనందకుమార్, తహసిల్దార్ సౌజన్యలక్ష్మి స్వాగతం పలికారు. ఆలయంలో వెలిసిన వీరభద్రస్వామి, దుర్గాదేవి అమ్మవారులకు ప్రత్యేకంగా పూజలు చేసారు. అనంతరం ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించి ఆనందం వ్యక్తం చేసారు. ఏడు శిరస్సుల నాగేంద్రుని విగ్రహం. ప్రపంచ ప్రసిద్ధి చెందిన నంది విగ్రహం, నాట్యమంటపం, లతా మంటపం, కైలాసం లో జరిగిన పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సం ఇక్కడ చూపించిన దృశ్యాలు. కల్యాణంను తిలకించడడానికి విచ్చేసిన దేవతా మూర్తుల సన్నివేశం ను ఆయనకు వివరించారు. దేవాదాయ ధర్మదాయ సాంప్రదాయం ప్రకారం ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహ మూర్తి పూలమాలలు వేసి శాలువలతో సత్కరించి ఆలయం మెమొంటోను అందజేసారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లేపాక్షి ఆలయం చాలా అద్భుతంగా వుందని, విజయ నగరాజుల కాలం నాటి ఆలయంలో శిల్పాలు, చిత్రలేఖనాలు చెక్క చెదరకుండా వుండడం పట్ల ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

శ్రీ కృష్ణ దేవరాయ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే

అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

విశాలాంధ్ర-గోరంట్ల : గోరంట్ల పట్టణంలోని శ్రీ కృష్ణ దేవరాయ జూనియర్ కళాశాలలో జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, మొదట ఈ కార్యక్రమం గురించి ప్రిన్సిపల్స్ విజయలక్ష్మి భక్తవత్సలం లు ప్రసంగిస్తూ విద్యార్థులు క్రమశిక్షణతో ఇష్టపడి చదవగలిగితే అమోఘమైన ఫలితాలు సాధించవచ్చునని, ఉన్నతమైన చదువులు చదివి ఉన్నత పదవులను అలంకరించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుస్తూ తమ జీవితా లను బంగారుమయం చేసుకోవాలని తెలియజేశారు, ప్రస్తుతం పోటీ తత్వం ఉన్న సమాజంలో నెగ్గుకు రావాలంటే గుణాత్మకమైన విద్యను అభ్యసించాలని తెలియజేశారు,ఆటల పోటీలు నిరసించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు, అనంతరం కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపకులు ఆజాద్, అరవింద్, బాల మోహన్, కవిత, అర్షియ, గోవింద్ పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

విశాలాంధ్ర-ధర్మవరం: రాజీమార్గమే రాజ మార్గం అవుతుందని సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) వెంకటేశ్వర్లు, ప్రిన్సిపుల్ జూనియర్ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) బొజ్జప్ప తెలిపారు. శనివారం వారు పట్టణంలోని ధర్మవరం కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ జాతీయలోక్దాలతో 28 కేసులు పరిష్కారం కాపాడ్డాయని తెలిపారు. ఇందులో ప్రీలిటి కేషన్ కేసులు 8 (5 లక్షల 57000), సివిల్ కేసులు మూడు (50,000 రూపాయలు), చెక్ పవన్ కేసులు 4(17,50,000 రూపాయలు), ఎక్సైజ్ కేసులు 2 (16,500 రూపాయలు) ఐఎఫ్సి కేసులు 11 మొత్తం వెలసి 28 కేసులు పరిష్కరించబడ్డాయని తెలిపారు. ఈ కేసులన్నీ రాజీకి తగ్గ కేసులు మాత్రమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వారితోపాటు న్యాయవాదులు డిఎల్ఎన్ మూర్తి, వెంకటరామిరెడ్డి, బిల్లే రవీంద్ర, పెద్దన్న పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆరోగ్య నిమిత్తం ఆర్థిక సాయం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని శ్రీ సత్య కృపా మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న సబీనా అనే విద్యార్థి కాలేయ సమస్యతో గత కొద్దికాలంగా బాధపడుతూ ఉంది. మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని సెయింట్ జాన్స్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అక్కడ వైద్యులు పరిశీలించి వైద్యం నిమిత్తం 25 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు కళాశాల నిర్వాహకుల సహాయంతో రూ.80 వేలు సమకూర్చి వారి తల్లిదండ్రులకు ఇవ్వడం జరిగింది. ఆ విద్యార్థులకు కాలేజీ అధ్యాపకులకు కర్రస్పాండెంట్ వంశీకృష్ణ, ప్రిన్సిపాల్ మల్లికార్జున అభినందించారు.

బెస్ట్ ఎమర్జింగ్ స్కూల్‌గా రిషి విద్యాలయ

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని రుషి విద్యాలయ పాఠశాల జాతీయ స్థాయిలో బెస్ట్ ఎమర్జింగ్ స్కూల్ అవార్డును దక్కించుకొందని పాఠశాల డీన్ భాస్కర్ రెడ్డి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ దేశంలోని అత్యుత్తమ ప్రైవేట్ పాఠశాలలను గుర్తించడానికి దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించిన సిఫోర్ పరిశోధనా సంస్థ ఈ గుర్తింపును ప్రకటించినది తెలిపారు. ఢిల్లీలో జరిగిన సన్మాన సభలో ఈ అవార్డు అందుకోవడం జరిగిందని తెలిపారు. భారతదేశంలోని అత్యుత్తమ పాఠశాలగా ఒకటిగా పేరు పొందడం, గౌరవము, బాధ్యత అని ప్రగతిశీల విద్యలో ప్రమాణాలు పాటిస్తున్నామని హెడ్మాస్టర్ కరణ్ స్వరూప సింగ్ తెలిపారు. సీఈవో రవీంద్ర మాట్లాడుతూ నిష్ణాతులైన యాజమాన్యం వారు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, బోధన, మౌలిక సదుపాయాల ఆధారంగా ఈ అవార్డు వచ్చిందని తెలిపారు.

సహకార సంఘం అధ్యక్షునికి సన్మానం

విశాలాంధ్ర-ధర్మవరం: గొట్లూరు సహకార సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన మేకల రామాంజనేయులును, సొసైటీ సభ్యుడిగా ఎన్నికైన పోతుకుంట రవిని టిడిపి నాయకులు బొట్టు కృష్ణప్ప, అంగజాల వీరప్ప, జింకల రాజన్న, పూజ మొబైల్ సాయి లింగప్ప, సూరీలు ఘనంగా సన్మానించారు. టిడిపి హయాంలో ఇటువంటి పదవులు పొందడం నిజంగా గర్వించదగ్గ విషయమని తెలిపారు. పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని మేకల రామాంజనేయులు, రవి తెలిపారు.

45 మంది చేనేతల అధ్యయన యాత్ర

విశాలాంధ్ర-ధర్మవరం: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు 45 మంది చేనేతకారులు కాంచీపురం హ్యాండ్‌లూమ్ క్లస్టర్ స్టడీ టూర్ కోసం బయలు దేరారని మంత్రి నియోజక వర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు తెలిపారు. శనివారం మాట్లాడుతూ ఈ స్టడీ టూర్ ద్వారా చేనేతకారులు కొత్త సాంకేతికతలు, మార్కెట్ ధోరణులు, డిజైన్ వైవిధ్యం ఉత్పత్తి పద్ధతులను నేర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో ధర్మవరం చేనేత పరిశ్రమను మరింత అభివృద్ధి చేయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ పర్యటనలో చేనేతలతో పాటు హ్యాండ్‌లూమ్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ కూడా పాల్గొంటారని తెలిపారు.అనంతరం ధర్మవరం కొత్తపేట అంజనేయస్వామి గుడి వద్ద నుంచి బస్సును మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు ప్రారంభించారు. ధర్మవరం చేనేతలకు త్వరలో ప్రారంభమయ్యే మెగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్ అభివృద్ధికి ఈ స్టడీ టూర్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని కాంచీపురం హ్యాండ్‌లూమ్ క్లస్టర్‌లో జరుగుతున్న ఆధునిక విధానాలను పరిశీలించి, అక్కడి అనుభవాన్ని సొంతం చేసుకుని, ఇక్కడి చేనేత పరిశ్రమను బలోపేతం చేయాలని మంత్రి సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్..

విశాలాంధ్ర-ధర్మవరం: 33 కెవి కనగానపల్లి ఫీడర్ ఎల్సి తీసుకొని మరమ్మత్తులు ఉన్నందున ఈనెల 14వ తేదీ ఆదివారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పోతుకుంట సబ్ స్టేషన్కు విద్యుత్ సరఫరా నిలిపివేయబడినని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ. జానకిరామయ్య తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పోతుకుంట, బృందావనం కాలనీ, రేగాటిపల్లి, కట్ట కింద పల్లి, కామిరెడ్డిపల్లి, కొనుతూరు, ముచ్చు రాము తదితర పల్లెలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. కావున ప్రజలు సహకరించాలని తెలిపారు.

ఐఆర్ 30 శాతం ప్రకటించాలి

విశాలాంధ్ర-ధర్మవరం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు తక్షణమే 12 వ పిఆర్‌సి ప్రకటించి, 30 శాతం ఐఆర్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ధర్మవరం మండల శాఖ, పట్టణ శాఖల ఆధ్వర్యంలో శనివారం సత్యకుమార్ నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ హరీష్ బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర నాయకులు బి కే ముత్యాలప్ప ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సానే రవీందర్ రెడ్డి, కేబలరాముడు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు కాలం పూర్తి అయినా ఉపాధ్యాయ, ఉద్యోగస్థులు సమస్యలు పరిష్కారం చేయక పోవడం దురదృష్టకరం అన్నారు. పెండింగ్ లో ఉన్న నాలుగు డి ఎ వెంటనే ప్రకటించాలి అని, సిపిఎస్ రద్దు చేసి, ఓపిఎస్ అమలు చేయాలని, ఈహెచ్ఎస్ పరిమితిని 25 లక్షలకు పెంచాలని, అసిస్టెంట్ బుక్స్ విధానం రద్దు చేయాలి అన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసులు ధర్మవరం మండల పట్టణ శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శివానంద, ఈశ్వరయ్య, గోపి, అంజి నాయక్, బత్తలపల్లి మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోపాల్ నాగశేషు, చెన్నేకొత్తపల్లి మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగస్తుల సమస్యలు పరిష్కారం చేయకుంటే దశలవారీగా ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో జెన్నే నాగప్ప, గోపాలకృష్ణ మారెప్ప నరసింహులు బయన్న వాసుకుమార్,శంకర్ నారాయణ,హేమంత్, బాలయ్య, జగదీష్, రవికుమార్, చంద్రుడు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

విశాలాంధ్ర-నంబులపూలకుంట : మండల పరిధిలోని వెలిచెలమల గ్రామంలో శనివారం 12 మెట్రిక్ టన్నుల (280 బస్తాలు) యూరియాను ఒక్కొక్కరికి రెండు బస్తాల 140 మంది రైతులకు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి వి.లోకేశ్వర రెడ్డి తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై వలి సాబ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సమానంగా పంపిణీ చేశామని ఏవో తెలిపారు.

రైతు సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-రొద్దం: రైతు సమస్యలైన గిట్టుబాటు ధర, ఎరువుల కొరత, అక్రమ ఇసుక తవ్వకాల సమస్య పరిష్కకరించాలని రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానిక కాంబదేవి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రధాన సమస్య సోలార్ పేరుతో బలవంతంగా మాయమాటలు చెప్పి దాదాపు 50 వేల ఎకరాలు ఉమ్మడి జిల్లాలో స్వీకరించడానికి ప్రయత్నం చేయడం మంచిపద్ధతి కాదన్నారు. ఈ సమస్యలను త్వరగా పరిష్కరించాలని.. లేనిపక్షంలో రైతు సంఘం ఉద్యమాలు చేపడుతుందని తెలియజేశారు. ఇదే సందర్భంగా అధ్యక్షులు కార్యదర్శులుగా కే.శ్రీనివాస్ చారి, ఆర్.గిరీష్ కమిటీ సభ్యులుగా రుద్రప్ప రామాంజనేయులు, ఆర్.వెంకటేష్, బి.హనుమంతు ఎం.రామాంజనే యులు హనుమయ్యలతో పాటు కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జిల్లా కమిటీ సభ్యులు ఫక్రోదిన్ వ్యకాసం నాయకులు కోగిర నారాయణ కొండా వెంకటేశులు పాల్గొన్నారు.

కాలువల పూడికతీత పనులు పరిశీలన

విశాలాంధ్ర-కొత్తచెరువు : బుక్కపట్నం చెరువు కింద ఉన్న ఆయకట్టు నీరు వెళ్లే కాలువలు పూడికతీత పనులను. బుక్కపట్నం చెరువు సాగునీటి సంఘం అధ్యక్షులు నవీన్ కుమార్, ఇరిగేషన్ జేఈ జమున బాయ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిటాచరుతో ముళ్ల కంపలు, చెత్త చెదారం పూడిక తీత పనులను చేపడుతున్నామన్నారు. ఆయకట్టు కాలువలు పనులను పూర్తి చేసి ఆ భూములకు సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. కాలువలు ఆక్రమణకు గురైన వాటిని గుర్తించి వాటిని తొలగిస్తామన్నారు. ఈ పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘం నెంబర్ చలపతి, మానవ హక్కుల సంఘం నాయకులు పాపన్న పాల్గొన్నారు.

మూడు ఇసుక టిప్పర్లు పట్టివేత

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు సమీపంలోని చిత్రావతి నది నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక టిప్పర్లను ముదిగుబ్బ పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి సమయంలో ముదిగుబ్బ సీఐ జి.శివరాముడు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమ ఇసుక లోడుతో వెళుతున్న మూడు టిప్పర్లను సీజ్ చేసి, సంబంధిత వివరాలను జిల్లా మైన్స్ అండ్ జియాలజీ శాఖ అధికారులకు తెలియజేసారు. ప్రజలు ఇసుకను కేవలం ప్రభుత్వం అనుమతి ఇచ్చిన శాండ్ రీచ్ల నుంచే వినియోగించుకోవాలని తెలిపారు.

జిల్లా కోర్టుకు స్థల పరిశీలన

విశాలాంధ్ర-పుట్టపర్తి : జిల్లాలో జిల్లా కోర్టు కోసం హైకోర్టు న్యాయమూర్తి రామకృష్ణ ప్రసాద్ స్థల పరిశీలన చేశారు. శనివారం ప్రశాంతి నిలయం శాంతిభవనం కి ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ చేరుకోగా జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీవో సువర్ణ, హిందూపురం సీనియర్ సివిల్ జడ్జి శైలజ, పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జ్ సయ్యద్ ముజీబ్ లు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం హైకోర్టు జడ్జి శాంతిభవనం నుంచి కప్పలబండ పొలంలో జిల్లా కోర్టు ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. ఇందులో మెరుగైన వసతులు కలిగిన వాటిలో కోర్టు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆయన పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని శాంతిభవనం చేరుకున్నారు. సాయంత్రం సత్యసాయిబాబా మహాసమాధిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు.

15న చలో అనంతపురం తరలిరండి

విశాలాంధ్ర-రొళ్ల: ఉమ్మడి అనంతపురం జిల్లాలో లక్షలాదిమంది తాడిత పీడిత బడుగు బలహీన వర్గాలు జీవితాల్లో వెలుగు నింపిన ఆర్డీటి సంస్థకు అందాల్సిన ఎఫ్.సి.ఆర్.ఏ (ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్) నిధుల పునరుద్ధరణకై చలో అనంతపురం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు ప్రజలు ప్రజా సంఘాలు విజ్ఞప్తి మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఇప్పటికే ఢిల్లీకి వెళ్లి కేంద్ర హోం మంత్రి దృష్టికి తీసుకువెళ్లిన విషయం తెలిసిందే.అయినా కేంద్ర ప్రభుత్వంలో ఎలాంటి స్పందన లేదు కావున ఈ నెల సెప్టెంబర్ 15 న సోమవారం ఆర్ట్స్ కళాశాల నుండి కలెక్టర్ కార్యాలయం వరకు వేలాది మందితో ర్యాలీ కార్యక్రమం చేపట్టేందుకు ఎస్సీ ఎస్టీ అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు ఎం.శ్రీనివాస్ జిల్లా నాయకులు మండల కేంద్రంలో నిర్వహించి కరపత్రం విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫాదర్ ఇన్సెడ్ ఫెర్రర్ ఆయన సతీమణి అన్నే ఫెరర్ స్పెయిన్ దేశం నుండి ఇండియాకు వచ్చి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అనంతపురం జిల్లా వెనుకబడిన ప్రాంతమని గ్రహించి 1969 లో స్థాపించిన ఆర్డిటి సంస్థ విదేశీ నిధులతో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న లక్షలాదిమంది పేదల అభివృద్ధికి సంస్థ సేవా కార్యక్రమాలతో వారి జీవితాల్లో చైతన్యం తీసుకొచ్చిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలను అన్ని రంగాలలో వ్యవసాయం నీటిపారుదల మహిళా సాధికారిక విద్యాభివృద్ధికి సంస్థ కోట్లాది రూపాయలను ఖర్చు చేసిందన్నారు అలాంటి సంస్థ నిర్వీర్యమై తన ఉనికిని కోల్పోయి ఇతర దేశాలకు వలస వెళ్లే ప్రమాదం ఏర్పడిందన్నారు ఇలాంటి పరిస్థితి నుండి ఆర్డిటి సంస్థను గట్టెక్కించేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఎస్సీ,ఎస్టీ బీసీ నిరుపేద వర్గాల ప్రజలు వేలాదిగా సెప్టెంబర్ 15న అనంతపురం తరలి రావాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అలుపనపల్లి శ్రీనివాస్ జిల్లా నాయకులు కాంతరాజు తదితరులు పాల్గొన్నారు..

సీఐటీయూలో చేరికలు

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు : సివిల్ సప్లై ఔట్సోర్సింగ్ ఉద్యోగులు సిఐటియు కార్మిక సంఘం సభ్యత్వాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి జిల్లా సివిల్ సప్లై అవుట్సోర్సింగ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షులుగా షమీవుల్లా, ప్రధాన కార్యదర్శిగా బత్తల లక్ష్మీపతి లు ఎన్నికైయ్యారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ వెంకటేష్ హాజరై మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో పనిచేసే డిఈఓ,సెక్యూరిటీ, పంపు బాయ్సుకు ఉద్యోగ భద్రత కల్పించి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ సెలవులు కానీ పండగ సెలవులు, టీఏడీఏలు ఇవ్వాలన్నారు. సెక్యూరిటీ గార్డ్స్ బకాయి జీతాలు చెల్లించాలన్నారు. కోశాధికారిగా శ్రీలక్ష్మి, వీరభద్ర ఉపాధ్యక్షులుగా మహబూబ్ బాషా, రెడ్డి శేఖర్ సహాయ కార్యదర్శులుగా ఏకగ్రీవంగా కమిటీ ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు,పెనుగొండ మండల కన్వీనర్ బాబావలి పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 14, సెప్టెంబర్ 2025

సర్పంచ్‌ను పరామర్శించిన వైసీపీ ఇన్చార్జ్ ఈరలక్కప్ప

విశాలాంధ్ర-గుడిబండ: గుడిబండ మండలంలోని మందలపల్లి సర్పంచ్ అశ్వత్ గత కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతూ కర్ణాటక రాష్ట్రంలోని తూముకూరు నగరంలోని సిద్ధగంగ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న మడకశిర స్వమున్నయకర్త ఈరలక్కప్ప అశ్వత్థను పరామర్శించి అతని ఆరోగ్య పరిస్థితిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిద్ధగంగా ఆసుపత్రిలోని డాక్టర్లతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లకు సూచించినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. సర్పంచ్ అశ్వత్‌ను పరామర్శించిన వారిలో మోరబాగల్ సర్పంచ్ తిప్పేస్వామి,వైసిపి నాయకులు జంబలబండ పాండు,ఈరన్నలు ఉన్నారు.

రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర-గోరంట్ల: రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్ సవితమ్మ ఆదేశాల మేరకు గోరంట్ల పట్టణంలోని వన్నప్ప నగర్‌లో రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు,కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమం లో రాష్ట్రం నెంబర్ వన్ గా దూసుకుపోతోందని,గుంతల రోడ్ల తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, మంత్రి ఆదేశాలతో గోరంట్ల మండలంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం ముమ్మరంగా జరుగుతుందన్నారు, ప్రజలకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుగుతున్న అభివృద్ధి, మౌలిక వసతులు కల్పించడం జరుగు తొందన్నారు, ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి,మండల టీడీపీ నాయకులు నిత్యశ్రీ జ్యువెలర్స్ యజమాని నిమ్మల శ్రీధర్, సర్పంచ్ సరోజ నాగే నాయక్, మాజీ ఎంపీపీ నిమ్మల విద్య ధరణి, మాజీ సర్పంచ్ నరేష్ కుమార్, ఉత్తమ రెడ్డి,షేక్ అజ్మతుల్లా, సహకార సంఘం చైర్ పర్సన్ చందమూరి గోపాల్ రెడ్డి, పాయల రమణ, రవిమోహన్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ తిరుపాల్, సహకార సంఘం డైరెక్టర్ నబీ రసూల్, దేవాంగం శ్రీనివాసులు, రవినాయక్ ,పట్టణ కన్వీనర్ రఘునాథ్ రెడ్డి,జయరామ్, కురుబ మహేంద్ర, మల్లికార్జున, శ్రీనివాసులు, వన్నప్ప, బాలకృష్ణ, ఉత్తప్ప, గంగం పల్లి సుబహన్, మామిడి కాయల హరి ప్రసాద్, రోహిత్, శ్రీకాంత్,మాలపల్లి మొహమ్మద్,నాగేంద్ర తో పాటు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గాయపడ్డ టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులను పరామర్శించిన పరిటాల శ్రీరామ్

విశాలాంధ్ర-ధర్మవరం: ఇటీవల ద్విచక్ర వాహనంలో ప్రమాదానికి గురి అయ్యి గాయపడ్డ టిడిపి ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కేశగాల్ల శ్రీనివాసులు జర్నలిస్ట్ కాలనీలో గల వారి స్వగృహానికి వెళ్లి టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్ ఛార్జీ పరిటాల శ్రీరామ్ పరామర్శించడం జరిగింది. పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు ఆరోగ్యాన్ని సరిగా చూసుకోవాలని చెప్పి సూచించడం జరిగింది. ఏదైనా అవసరమైతే ఎల్లవేళలా నేను అందుబాటులో ఉంటాను అని చెప్పడం జరిగింది చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ కమతం కాటమయ్య పట్టణ అధ్యక్షులు పరిష సుధాకర్, యువ నాయకులు సంద రాఘవ మైనార్టీ జిల్లా నాయకులు నాగురు హుస్సేన్ పెద్దన్న పురుషోత్తం గౌడ్ కేత శ్రీనివాసులు, యంబ చంద్ర,బొట్టు కిష్ట , రాజన్న,వీరయ్య,సాయి తదితరులు ఉన్నారు.

విద్యతో పాటు విలువలు సంస్కారం విద్యార్థి దశలో నేర్చుకోవాలి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని రిషి విద్యాలయంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ధర్మవరం శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులలో విలువలు పెంపొందించుటకు ప్రతిభ పాటవ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఉపాధ్యక్షులు మంజునాథ్ కార్యదర్శి సాయి ప్రసాదులు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు విద్యార్థి దశలో ఆచరించదగిన విషయాలు అనే అంశంపై పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కల్గిన విద్యార్థులకు ప్రథమశ్రేణి :జి శాన్వి రెడ్డి (6వ తరగతి), ద్వితీయశ్రేణి :సి. నిఖిల్ (7వ తరగతి), తృతీయశ్రేణి :ఎస్ మోక్ష మాధవి (7వ తరగతి), వారికి బహుమతులు, సర్టిఫికెట్స్ రిషి విద్యాలయం హెడ్మాస్టర్ కరణ్ స్వరూప సింగ్, డీన్ భాస్కర్ రెడ్డి చేతులు మీదుగా అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యతో పాటు విలువలు, సంస్కారం విద్యార్థి దశలో నేర్చుకోవాలి అని తెలుపుతూ హర్షం తెలియజేసారు. అనంతరం సంస్థ సభ్యులకు శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సోమేశ్వర్ రెడ్డి తెలుగు ఉపాధ్యాయుడు మారుతి , విద్యార్థులు పాల్గొన్నారు.

భాస్కర్ రెడ్డి అకాల మృతి చెందడం చాలా బాధాకరం

విశాలాంధ్ర-కణేకల్లు: తన తోటి నాయకులను అభిమానులను ప్రజలను అందరినీ ఆప్యాయంగా పలకరించే తోపుదుర్తి భాస్కర్ రెడ్డి అకాల మృతి చెందడం అత్యంత బాధాకరమని వైసీపీ కనేకల్ మండల కన్వీనర్ బ్రహ్మానంద రెడ్డి పార్టీ నాయకులు సంతపాన్ని తెలియజేశారు. భాస్కర్ రెడ్డి ఆకస్మిక మరణం చాలా దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆయన క్రమశిక్షణ కలిగిన నాయకులు అని ఆయన వైయస్సార్ పార్టీకి ఎనలేని సేవలను అందించారని అవి మర్చిపోలేనవీ కొనియాడారు. భాస్కర్ రెడ్డి పవిత్రాత్మకు శాంతిని కలగజేయాలని వారి కుటుంబ సభ్యులను దేవుడు ధైర్యం చేకూర్చాలని వైయస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు కోరారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లులో ఆంజనేయస్వామి ఆల యంలో శనివారం అం జన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అర్చ కుడు అనిల్ కుమార్ చార్యులు ఆధ్వర్యంలో అం జన్నకు పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పా లంకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు అన్నదాన కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

విశాలాంధ్ర - అగళి : మండల కేంద్రం సమీపంలోని ఎం ఎం పాళ్యం గ్రామంలో వెలసిన శ్రీ గురు దత్తాత్రేయ స్వామి దేవాలయం వద్ద ఇస్కాన్ టెంపుల్ వారు శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వేద పండితులు శనివారం సాయంత్రం అగళి నుండి ఎంఎం పాళ్యం దత్తాత్రేయ స్వామి దేవాలయం వరకు పురవీధులగుండా మంగళ వాయిద్యాల నడుమ హరినామ సంకీర్తనలతో హరే కృష్ణ ఇస్కాన్ టెంపుల్ శ్రీ సత్య సాయి జిల్లా అనంతపురం ఉమ్మడి జిల్లాల టెంపుల్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి దత్తాత్రేయ దేవాలయంలో కూడా నిర్వహించారు. ఈ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్ని పురస్కరించుకొని అగలి పట్టణం నుండి దత్తాత్రేయ దేవాలయం వరకు హరినామ సంకీర్తన భజనలు ఆరున్నర గంటలకు శ్రీకృష్ణ భగవానుడికి మహా పంచామృత శంఖాభిషేకం జరిపారు. పుష్ప అభిషేకంతో పాటు శ్రీమత్ భాగవత ప్రవచన కర్త అయినటువంటి శ్రీమాన్ శ్రీనివాస్ ప్రభు వారిచే శ్రీమద్ భాగవత ప్రవచనం కృష్ణ కథామృత ప్రవచనం చేశారు భగవంతుడికి మహా మంగళ హారతి నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలు భక్తులు పాల్గొన్నారు వచ్చినటువంటి భక్తార్థులకు తీర్థప్రసాదాలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలను పారదర్శకంగా ముందుకు తీసుకెళ్తాం

విశాలాంధ్ర-పుట్టపర్తి: ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో ప్రభుత్వ సేవలను పారదర్శకంగా ముందుకు తీసుకెళ్లి జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేస్తానని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నూతనంగా జిల్లా కలెక్టర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను పలువురు అధికారులు, సిబ్బంది పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ తాను పార్వతీపురం మన్యం జిల్లా నుండి కలెక్టర్ గా బదిలీ అయి శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించానన్నారు. సత్యసాయి జిల్లాతో తనకు అవినాభావ సంబంధం ఉందని, తన కుమార్తె విద్యాభ్యాసం సత్యసాయి విద్యాసంస్థలలో చదవడం జరిగిందన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో రాబోయే వంద సంవత్సరాల శ్రీసత్య సాయిబాబా జన్మదినోత్సవ వేడుకలను కూడా విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. కర్ణాటక రాష్ట్రానికి సమీపంలో ఉండి వెనుకబడిన శ్రీసత్యసాయి జిల్లాను అన్ని విధాల ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. వ్యవసాయ ఆధారిత జిల్లా అయిన సత్య సాయి జిల్లాలో పారిశ్రామిక రంగానికి కూడా ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లాలో పరిశుభ్రత, నీటి సరఫరా, విద్యుత్, జల సంరక్షణ, ఆరోగ్యము విద్య తదితర ప్రధానమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలియజేశారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను మరింత సమర్థంగా అమలు చేసి ప్రజలకు చేరవేయడమే తన ముఖ్య లక్ష్యంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు, అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇస్తూ పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పనిచేస్తానని కలెక్టర్ తెలిపారు. ప్రతి పౌరుడికి అవసరమైన సేవలను త్వరితగతిన అందించేందుకు కృషి చేస్తామని, సేవాభావంతో, పారదర్శకంగా పని చేస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇంఛార్జి డిఆర్ఓ రామసుబ్బయ్య, ఆర్డీవోలు సువర్ణ, మహేష్, వివిఎస్ శర్మ, ఆనంద్ కుమార్, జిల్లా అధికారులు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

15న కర్నూలులో యుటీఎఫ్ రణభేరి

విశాలాంధ్ర-ధర్మవరం: రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు, సంబంధించిన ఆర్థిక, ఆర్థికేతర విద్యారంగా సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో 5ప్రాంతాల్లో ఈ నెల 15వ తేదీ నుండి 19 తేది వరకు నిర్వహించే రణభేరి కార్యక్రమం పశ్చిమ రాయలసీమ ప్రాంతంలో 15వ తేదీ సోమవారం రోజున ఉదయం 10గంటలకు కర్నూలు నగరంలో ప్రారంభమ వుతుందని, 16వ తేదీ అనంతపురం జిల్లా, 17వ తేదీ సత్యసాయి జిల్లా, 18వ తేదీ అన్నమయ్య, కడప జిల్లాలో 19వ తేదీ కడప, నంద్యాల జిల్లాలో ఈ రణభేరి యాత్ర కొనసాగునని ఈ రణభేరిలో పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు,యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయ చంద్రా రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా కార్యదర్శి ఆర్. రామకృష్ణ నాయక్‌తో ధర్మవరం యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జయచంద్రా రెడ్డి, రామకృష్ణ నాయక్ మాట్లాడుతూ 12వ పిఆర్సి ఊసేలేదని, నూతన కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నప్పటికీ ఒక్క డి.ఏ. కూడా ఇవ్వకపోగా వేల కోట్ల ఆర్థిక బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇక విద్యాశాఖలో నిరంతరం బోధనేతర కార్యక్రమాలతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని విమర్శించారు. 2003లో నియమితులైన ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం మెమో నంబర్ 57జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం శోచనీయమని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పాత పెన్షన్ విధానాన్ని 2003 ఉద్యోగ ఉపాధ్యాయులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మయ్య, జింక హరికృష్ణ, నాగిరెడ్డి, హెచ్. రామాంజనేయులు, సాయి గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

విశాలాంధ్ర-ఉరవకొండ: విద్యార్థిల సమస్యల పరిష్కారమే ఏఐఎఫ్డిఎస్ లక్ష్యమని అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నందు, సిద్దు తెలిపారు. శనివారం ఉరవకొండలో విద్యార్థి సంఘం మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని కూడా వారు ప్రకటించారు. సమావేశంలో జిల్లా నాయకులు మాట్లాడుతూ జీ.వో నెంబర్ 77ను వెంటనే రద్దు చేయాలని, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు 6400 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు 3000 రూపాయలకు పెంచి మెరుగైనటువంటి వసతులు అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ మొండి వైఖరిని వీడి విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాల న్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి రాష్ట్ర విద్యా విధానాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది అన్నారు. గత వైసిపి, నేడు కూటమి ప్రభుత్వం కూడా దాన్ని నిరాటంకంగా కొనసాగిస్తుందన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పాఠ్యపుస్తకాలలో చరిత్ర మీద దాడి చేస్తూ చరిత్రను వక్రీకరిస్తోందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై అలుపెరిగిన పోరాటాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం వారు ఉరవకొండ మండల నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కుల్లాయి స్వామి, ప్రధాన కార్యదర్శిగా మధు, ఉపాధ్యక్షులుగా సాయి భాస్కర్, మండల సహాయ కార్యదర్శులుగా మహేష్, వినయ్ కిరణ్, వంశీ, కార్తీక్, కుమార్, రాకేష్‌తో పాటు మరో 11మంది మండల కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు వారు ప్రకటించారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం పోరాటం

విశాలాంధ్ర-ఉరవకొండ: వెనుకబడిన వర్గాలు (ఎస్సీ ఎస్టీ ఓబీసీ,మైనార్టీలు) సమాన హక్కులు పొందేలా నిరంతరం పోరాడుతున్న సంస్థ బామ్ సేఫ్ అని వజ్రకరూరు మండలం చాబాల గ్రామ సర్పంచ్ మల్లెల జగదీష్ తెలిపారు. బామ్ సేఫ్ 28వ రాష్ట్ర సదస్సు అమలాపురంలో జరగగా ఈ సదస్సుకు సర్పంచ్ శనివారం హాజరయ్యి సమావేశంలో ప్రసంగించారు. ఏలూరు రిటైర్డ్ జడ్జి ఆడబాల లక్ష్మి, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బాబ్జి పాల్గొన్నారు. జగదీష్ మాట్లాడుతూ చదువుకున్న, ఉద్యోగాల్లో ఉన్న వెనుకబడిన వర్గాల వ్యక్తులను ఒకే వేదికపైకి తీసుకురావడం బామ్ సేఫ్ యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. అజ్ఞానం, మూఢనమ్మకాలు తొలగించి, విద్య ద్వారా చైతన్యం కావలసిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన వర్గాల ఆర్థిక స్థితిని మెరుగుపరచడం కోసం అవగాహన కల్పించాలన్నారు. అంబేద్కర్, పూలే,పెరియార్ ఆలోచనల ప్రచారం, సమానత్వం, స్వాభిమానం, హక్కుల కోసం పోరాట స్పూర్తిని కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బహుజన సమాజానికి రాజకీయ చైతన్యం కల్పించడం, స్వీయ శక్తిని గుర్తించడంలో సహకరించడం. మతం పేరుతో జరుగుతున్న దోపిడీ, వివక్ష నిర్మూలన కులవివక్ష, సామాజిక అసమానత తొలగించడానికి ప్రతి ఒక్కరు కూడా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. చదువుకున్న వెనుకబడిన వర్గాలను సంఘటితం చేసి, సమాజంలో సమానత్వం మరియు న్యాయం సాధించడానికి బహుజనలందరూ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. బామ్ సేఫ్ రాష్ట్ర మహాసభలలో నాయకులు తీసుకున్న నిర్ణయాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

లోక్ అదాలత్ రాజీ కేసులకు చక్కటి పరిష్కారం

విశాలాంధ్ర-పుట్టపర్తి: రాజీ కాదగ్గ కేసులకు లోక్ అదాలత్ చక్కటి పరిష్కారం చూపుతుందని పుట్టపర్తి జూనియర్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్ పిలుపునిచ్చారు. శనివారం జూనియర్ సివిల్ జడ్జి అధ్యక్షతన పుట్టపర్తిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐపిసి (సిసిలు)అడ్మిన్‌తో కలిపి 14 కేసులు మద్యం సిసి కేసులు 43 ఈ పి (సివిల్). చెక్ బౌన్స్ మెయింటైన్స్ కేసులు ఒక్కొక్కటి చొప్పున మూడు కేసులు కేసులు బాంక్ పి ఎల్ సి కేసులు 4 కేసులతో కలుపుకొని లోక్ అదాలత్‌లో 64 కేసులు పరిష్కరించబడ్డాయి. సివిల్ ఎక్సైజ్ క్రిమినల్ (ఫైన్ అమౌంట్), చెక్ బౌన్స్ బాంక్ ప్రి లిటీగషన్ కింద మొత్తం 1182680 విలువ గల వివిధ తగాదాలు రాజీ మార్గంలో పరిష్కారం కాబడ్డాయి. సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ రాజీ కాదగ్గ కేసులకుచక్కటి పరిష్కార వేదికగా లోక్ అదాలత్ ను అభివర్ణించారు. కేవలం చిన్న పాటి తగాదాలు మనస్పర్థలు మూలంగా పట్టింపులకు పోయి కేసులు నమోదుచేసుకొని ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి నష్టపోకుండా కక్షిదారుల మధ్య రాజీ కుదర్చడం ద్వారా కేసులకు పరిష్కారం చూపుతున్నామన్నారు. తద్వార కక్షి దారుల మధ్య సత్సంబంధాలు ఏర్పడి గ్రామాలలో శాంతియుత వాతావరణం నెలకొల్పడానికి దోహదం కలుగుతుందన్నారు. రాజీ కాదగ్గ కేసులను సులభమార్గంలో లోక్ అదాలత్ చక్కటి పరిష్కా రం చూపుతుందన్నారు.చెక్ బౌన్స్ కేసులలో కక్షిదారుల మధ్య సయోధ్య కుదిరితే చెల్లింపులకు దశలవారీ చెల్లింపుగడువుతో అవార్డు జారీ చేస్తామన్నారు. ఇరు వర్గాలనులోక్ అదాలత్‌లో విచారించి దోషాలను వారికి వివరించి భవిష్య త్తులో పునరావృత్తం కారాదని హెచ్చరికలు సైతం జారీ చేస్తుండడంతో వారిలో నేర స్వభావాన్ని తగ్గించేందుకు కూడా లోక్ అదాలత్‌లు దోహదప డుతున్నాయని వివరించారు. లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం జరుగుతుందని దీన్ని సద్విని యోగం చేసుకోవాలని జడ్జి ముజీప్ పసపల సయ్యద్ పిలుపునిచ్చారు. పుట్టపర్తి బార్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి, రాజేంద్ర ప్రసాద్ రెడ్డి,అతాపూర్ రహమాన్, వెంకటర మణప్ప,లెక్కల యదుభూషన్, కృష్ణప్రసాద్, భారతి రెడ్డి, కుంచేపు శ్రీనివాసులు, నాగేంద్ర,మౌనిక,కిరణ్, క్రిమినల్ క్లర్క్ మంజునాథ్,సివిల్ క్లర్క్ జ్యోతిభాయి, కోర్టుకానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై యుటీఎఫ్ రణబేరి

విశాలాంధ్ర-రొళ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ తలపెట్టిన రణబేరి కార్యక్రమం పోస్టర్లను నాయకులు,ఉపాధ్యాయుల సమక్షంలో శనివారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మండల యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్,అనిల్ కుమార్ లు మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో మాది ఉద్యోగుల ప్రభుత్వం అనీ చెప్పి,మేము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లిస్తామని, పీఆర్సీని వెంటనే అమలు చేస్తామని ప్రగల్భాలు పలికి ఇప్పటికి 15 నెలలు గడిచినా ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల పూర్తిగా నిర్లక్ష్య ధోరణితో ఉందని విమర్శించారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి 12 వ పి.ఆర్.సిని నియమించి 30% ఐఆర్ అమలు చేయడంతో పాటు పెండింగ్ లో ఉన్న డిఏలు,ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు అదేవిదంగా కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ వారిని పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.అదేవిదంగా ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగించుకోబోమని ఒకవైపు చెబుతూనే మరొక వైపు రకరకాల యాప్ లతో వివిధ రకాల శిక్షణలు ఫార్మేటివ్ అసెస్మెంట్ పుస్తకాలను ఉపాధ్యాయులే పూరించాలనడం ఇతరత్రా కార్యక్రమాలతో ఉపాధ్యాయులను మానసిక క్షోభకు గురిచేస్తోందన్నారు ఉపాధ్యాయ బదిలీలు ముగిసినప్పటికీ రిలీవర్ లేక ఎక్కడి వాళ్లు అక్కడే ఆగిపోవడంతో ఉపాధ్యాయుల్లో నిరాశ,ఆందోళన నెలకొందన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయుటకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.డీఎస్సీ ఉపాధ్యాయుల నియామకం తర్వాత బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చెయ్యాలనుకుంటే డియస్సీ ఉపాధ్యాయుల సంఖ్యను పెంచితే తప్ప సాధ్యం కాదన్నారు. ఈ సమస్యలు పరిష్కరించుటకు ప్రభుత్వం ఆ రకంగా చర్యలు తీసుకోవాలని,లేని పక్షంలో ఉద్యమ కార్యాచరణ చేసి పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు నాగరాజు,ఉపాధ్యక్షులు చిన్నికృష్ణ కోశాధికారి అనిల్ కుమార్ నాగేష్,రవికృష్ణ ఉపాధ్యాయులు యంజారప్ప,శ్రీనివాస రెడ్డి మహదేవప్ప,రమేష్ బాబు ఖాదర్ వలి శ్రీనివాసరెడ్డి,రెడ్డప్ప షణ్ముగం,స్వరూప రాణి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

విశాలాంధ్ర-కొత్తచెరువు: మండల పరిధిలోని తలమర్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన మారుతీ రెడ్డి, నోటి పుస్తకాలు పెన్నులు పెన్సిల్లు పంపిణీ చేశారు. 30 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. విద్యార్థులు బాగా చదువుకొని ప్రయోజకులు కావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వంశీ కిషోర్, రాకేష్, మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

17న యుటిఎఫ్ రణభేరి

విశాలాంధ్ర-గోరంట్ల: రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు, సంబంధించిన విద్యారంగ సమస్యలు, ఆర్థిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్న డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 వ తేదీ నుండి 19 తేది వరకు నిర్వహించే రణభేరిని విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ పిలుపునిచ్చారు,శుక్రవారం రోజున స్థానిక జిల్లా కార్యదర్శి కిష్టప్ప, సీనియర్ నాయకులు లతో కలసి గోరంట్ల యుటిఎఫ్ జోన్ ఆధ్వర్యంలో రణభేరి గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రణభేరి కార్యక్రమం ఈ నెల 17 వ తేదీన సత్య సాయి జిల్లా పెనుకొండ నందు ప్రారంభమై,గోరంట్ల, మీదుగా సాయంత్రం కదిరిలో ముగింపు ఉంటుందని తెలియచేసారు, గోరంట్లలో జరిగే యూటిఎఫ్ రనబేరి కార్యక్రమానికి ఉద్యోగ ఉపాధ్యాయలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుధాకర్, గోరంట్ల మండల అధ్యక్షులు మురళి, ప్రధాన కార్యదర్శి రామాంజి నేయులు, శ్రీధర్ రావు, కిష్టప్ప, రామకృష్ణ, నగేష్ ,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ పట్టణంలోని సివిల్ సప్లై గోడౌన్ నందు కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించడం జరిగింది, ఈ సందర్భంగా కామ్రేడ్ నాగరాజు కామ్రేడ్ బాబావలి మాట్లాడుతూ కామ్రేడ్ సీతారాం ఏచూరి తమ జీవితాన్ని ప్రజల కోసం కార్మికుల కోసం అంకితం చేశారని రాజ్యసభ సభ్యునిగా దేశానికి సేవ చేశారని తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో బావమ్మ, మహబూబ్ బాషా ,నరసింహ ,సుధాకర్ ,హనుమంతు ,వలి, తిప్పన, సలీం బాబు ,నాగేంద్ర, ఓబులేసు ,తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి పల్లకి ఉత్సవం

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ మండలం పెన్నాహోబిలం లక్ష్మీనంసింహస్వామి ఆలయంలో శ్రీవారి పల్లకి ఉత్సవం కార్యక్రమం శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభయమానంగా తీర్చిదిద్దిన పల్లకిలో కొలవ దీర్చి ఆలయము చుట్టూ ప్రదక్షణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

11వ శనివారం విజయవంతమైన అన్నదానం

విశాలాంధ్ర-శింగనమల: మండల పరిధిలోనిశింగనమల క్రాస్ లో 11వ శనివారం అన్నదాన కార్యక్రమం శింగనమల రామ గణేష్ ఉత్సవ సమితివారు నిర్వహించారు. ఈ సందర్భంగా రుష్యశృంగ మహాముని, శ్రీరంగ రాయల సేవా సమితి సభ్యులు రాంచరణ్ యాదవ్ మాట్లాడుతూ, దాతలు, మరియు భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ అన్నదాన కార్యక్రమానికి సహకరించిన వారి కుటుంబ సభ్యులందరికీ శ్రీ ఋష్య శృంగ మహాముని స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి వారము సహకరించి, విజయవంతంగా నడిపిన వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్వామివారి సన్నిధిలో పూజా కార్యక్రమం అన్నదాన కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమానికి సహకరించిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విజన్‌లో ఘనంగా హిందీ భాషా దినోత్సవం

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని విజన్ విద్యా సంస్థలో శనివారం విజన్ స్కూల్ విద్యాసంస్థల అధినేత విశ్వనాథ్ ఆధ్వర్యం లో ఉపాధ్యాయ బృందం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హిందీ అధ్యాపకులు తహూన్, గైబ్యున్నిసా మాట్లాడుతూ హిందీని కేంద్ర ప్రభుత్వ అధికార భాషగా గుర్తించిన రోజుహిందీ భాషా దినోత్సవంగా ప్రతి సంవత్సరం సెప్టెంబరు 14న జరుపుకుంటారు అని,భారత జాతీయోద్యమంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి, ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష ఆనాడు దోహద పడినందున గాంధీజీ స్ఫూర్తితో 1949 సెప్టెంబరు 14న రాజ్యాంగంలోని 351వ అధికరణం 8వ షెడ్యూల్‌లో హిందీని కేంద్ర ప్రభుత్వ అధికార భాషగా గుర్తిస్తూ పొందుపరిచారు. అనంతరం విజన్ ఉపాధ్యాయ బృందం హిందీ అధ్యాపకులను ఘనంగా సత్కరించారు.